కేశవరం ఫ్లైఓవర్‌కు తొలి అడుగు

- స్థల సేకరణకు సర్వే
- పరిశీలించిన రెవెన్యూ, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు
- నేటి నుంచి సర్వే పనులు ప్రారంభం


రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు (ఫైల్)

మండపేట: నిత్యం ప్రయాణికులకు నరక యాతన చూపించే మండలంలోని కేశవరం రైల్వే గేటు సమస్య పరిష్కారం నిమిత్తం ఫ్లైఓవర్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. వంతెన నిర్మించే స్థలాన్ని శుక్రవారం రెవెన్యూ, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు పరిశీలించారు. స్థల సేకరణ సర్వే పనులు శనివారం మొదలు కానున్నాయి.

ఈ పరిసర వాసులు రాజమహేంద్రవరం వెళ్లేందుకు కేశవరం మీదుగా దగ్గరి దారి. దాంతో మండపేట, రామచంద్రపురం, అనపర్తి నియోజకవర్గాల ప్రజలు సామర్లకోట కెనాల్ రోడ్డును ఆనుకుని ఉన్న రైల్వే గేటు దాటుకుని వెళుతుంటారు. కేశవరం గ్రామస్తులు మండల కేంద్రమైన మండపేట రావాలన్నా రేల్వేగేటు దాటి రావాలి. ఈ ప్రాంతంలో గోదాములు, గ్రావెల్ క్వారీలు అధికంగా ఉండడంతో లారీల రాకపోకలు అధికంగా ఉంటాయి. విజయవాడ-ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఇదే మెయిన్ లైన్ కావడంతో ఈ రూట్‌లో రైళ్ల రాకపోకలు ఎక్కువ. రైళ్ల రద్దీతో తరచూ గేటు పడుతుంటుంది. దీంతో సామర్లకోట కెనాల్ రోడ్డు, కేశవరం గ్రామం వైపు గేటుకు ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోతుంటాయి. ఒక్కోసారి రెండు మూడు రైళ్లు వెళ్లే వరకు గేటు తెరవరు. ఆ సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. దీనికితోడు ఒక్కోసారి రైల్వే గేటు మరమ్మతులకు గురై తెరుచుకోదు. ఆయా కారాణాలతో ప్రయాణికులు ఈ గేటు వద్ద తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గేటు వేసేస్తున్నారన్న కంగారులో వాహన చోదకులు వేగంగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

ఫ్లైఓవర్ నిర్మాణానికి వినతి

కేశవరంలో వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి 2013లో రైల్వేశాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నేతలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ద్వారా అమలాపురం, రాజమహేంద్రవరం ఎంపీలు చింతా అనురాధ, మార్గాని భరత్‌కుమార్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఇటీవల రాజమహేంద్రవరం వచ్చిన రైల్వే ఉన్నతాధికారులను వెంకన్నబాబు కలిసి సమస్య తీవ్రతను వివరించి ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు.



ట్రాఫిక్ సమస్యకు త్వరలో పరిష్కారం

దీర్ఘకాలంగా ప్రయాణికులు, కేశవరం ప్రజలను ఇబ్బంది పెడుతున్న రైల్వే గేటు సమస్య పరిష్కారం నిమిత్తం సర్వే పనులు మొదలయ్యాయి. త్వరలోనే ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని రైల్వే అధికారులు తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీలు చింతా అనురాధ, మార్గాని భరత్‌కుమార్‌లకు కృతజ్ఞతలు.

– దూలం వెంకన్నబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కేశవరం


స్థల సేకరణకు పరిశీలన చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరావు, ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులు, నాయకులు

స్థల పరిశీలన

ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణపై తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, రైల్వే అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ జేఈ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలన చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కెనాల్ రోడ్డులోని క్వారీ కాలువ తూము నుంచి ఉత్సవ చెరువు గట్టు మీదుగా రాజమహేంద్రవరం రోడ్డులోని గండి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. శనివారం నుంచి సర్వే పనులు ప్రారంభిస్తామని, ఎంత వరకూ స్థలసేకరణ చేయాలనే విషయం నాలుగు రోజుల్లో తెలుస్తుందని తహసీల్దార్ రాజేశ్వరరావు తెలిపారు, ఎట్టకేలకు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతుండటం పట్ల ప్రయాణికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అల్లంపల్లి కిషోర్, రాయపాటి సత్యనారాయణ, పరిమి శ్రీను, విన్నకోటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్మాణంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం


నిర్మాణంలో ఉన్న అంగరలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

కపిలేశ్వరపురం: అంగరలో సుదీర్ఘ కాలంగా నిర్వహణలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. గ్రామానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు తాత్కాలిక పెంకుల భవనంలో ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. స్వామి కల్యాణ పూజల సమయంలో అవసరాలకు తగిన విధంగా ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. త్వరితగతిన ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష


నల్లూరులో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ చేస్తున్న కార్యదర్శి తదితరులు

కపిలేశ్వరపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలరని ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. నల్లూరు, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, టేకి తదితర గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆయా పంచాయతీల కార్యదర్శులు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నివాస ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న పరికరాలనూ, వ్యర్థాలను తొలగింపజేశారు. కార్యక్రమాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో నూతన నివాసాలకు పన్ను

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తగా నిర్మించుకున్న నివాసాలకు శాస్త్రీయ పద్ధతిలో పన్నులను నిర్ధారిస్తున్నట్టు పంచాయతీల కార్యదర్శి శివ చక్రవర్తి అన్నారు. నాగులచెరువులో నూతన నివాసాలకు పన్నులు నిర్ధారించేందుకు సచివాలయ సిబ్బంది కొలతలను నమోదు చేశారు. కార్యదర్శి శివ చక్రవర్తి పర్యవేక్షణలో నిబంధనలు మేరకు ఆవాస ప్రాంతాలకు కొలతలు తీసుకున్నారు.

సంఘ అభివృద్ధికి పాటు పడాలి


మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సత్యనారాయణకు అభినందిస్తున్న దృశ్యం

కాజులూరు: సంఘ అభివృద్ధికి నాయకులు నిరంతరం పాటు పడాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంధం వసంతరావు అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న పి.నాగేశ్వరరావు మండలంలోని టి.మామిడాడ పాఠశాల నుంచి కరప మండలం బావారం బదిలీపై వెళ్లిపోయారు. దీంతో శుక్రవారం కాజులూరులో సంఘం మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వసంతరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా పెనుమళ్ళ పాఠశాలలో పనిచేస్తున్న కుడుపూడి సత్యనారాయణను సభ్యులు మండల ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర నాయకులు పీఎస్వీ ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు బండి నూకరాజు తదితరులు సత్యనారాయణను అభినందించారు.

ఆహ్లాదంగా ఫ్రెషర్స్ డే


కృత్తివెంటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్‌కు సత్కారం

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సోమశేఖరరావు అధ్యక్షతన శుక్రవారం ఇంటర్మీడియెట్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఆహ్లాదంగా జరిగింది. తొలుత ఇటీవల బదిలీపై వెళ్లిన అధ్యాపకులు అప్పలరాజు లక్ష్మీనారాయణ, కాంచనమాల, కేవీ సత్యనారాయణ, యేసురత్నం, తదితరులను అధ్యాపకులు, అనంతరం కొత్తగా బదిలీపై వచ్చిన ఇతర అధ్యాపకులను ప్రిన్సిపాల్ సోమశేఖరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, ఆలపించిన పాటలు అలరించాయి. స్థానిక సీతారామ కన్వెన్షన్ హాల్‌లోజరిగిన ఈ వేడుకల్లో అధ్యాపకులు పాల్గొన్నారు.

'సురక్ష' పై గ్రామాల్లో అవగాహన


కపిలేశ్వరపురంలో ఆరోగ్య వివరాలతో కూడిన పుస్తకాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఈ నెల 30 నుంచి అక్టోబర్ 31 వరకూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో శుక్రవారం ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి బీపీ, షుగర్, హెచ్‌బీ, మలేరియా, డెంగీ, కళ్లె పరీక్షలను చేశారు. నివేదికలతో కూడిన కేస్ స్టడీ పుస్తకాన్ని లబ్ధిదారులకు అందజేశారు. అక్టోబర్‌లో నిర్వహించే సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాల్లో అవసరమైన వారికి మెరుగైన చికిత్స అందించనున్నారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో కపిలేశ్వరపురం-1, అంగర, తాతపూడి, కపిలేశ్వరపురం-2, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు శీలం భాస్కరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు పిప్పర సంపతరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


నదురుబాదలో కరపత్రాలను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సిరిపురపు తదితరులు

పేదల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

రాయవరం: పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. నదురుబాదలో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ సిరిపురపు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పాటు వైద్యాన్ని సైతం ప్రజల చెంతకు అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు కృషి చేయాలని సిరిపురపు కోరారు. ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి దేవి రాజశ్రీ, వలంటీర్లు, పంచాయతీ, ఆరోగ్య, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో విజేతలుగా నిలవాలి

మండపేట: జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కుంగిపోకుండా ఆత్మస్థైరంతో ముందుకు సాగితే విజయాలను సొంతం చేసుకోవచ్చని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎంకేపీ వాణి అన్నారు. అంతర్జాతీయ ఆత్మహత్య నిర్మూలన కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, జేవీవీ పట్టణ శాఖ అధ్యక్షుడు పీఆర్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రాణం పోతే తిరిగి రాదని, ఎంతటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. చీకటి వెనుకే వెలుగు ఉంటుందని, ఓటమి వెనుకే విజయం ఉంటుందని వివరించారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి అయిన వారికి తీరని వేదనను కలిగించరాదన్నారు. వేచి ఉండి ఆలోచనతో కెరీర్‌ను ముందుకు తీసుకు వెళ్లాలి విద్యార్థులకు సూచించారు. స్ఫూర్తిని కలిగించే పలువురి విజయగాథలు కలిగిన కరపత్రాలను విద్యార్థులకు అందజేశారు. బలవన్మరణాలు లేని భారతాన్ని నిర్మిద్దామంటూ విద్యార్థులతో వాణి ప్రతిజ్ఞ చేయించారు. మహిళ పోలీస్ సీహెచ్ వల్లీ లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సామూహిక నిర్మూలనతోనే సత్ఫలితాలు

మండపేట: వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రైతులందరూ ఒకే రోజున పొలాల్లో ఎలుకల నివారణ మందు పెట్టడం ద్వారా వాటిని అరికట్టడంలో సత్ఫలితాలు సాధించవచ్చని మండపేట సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్ అన్నారు. మండపేటలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి ఎలుకల మందు పంపిణీని శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ గంగాధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఏవో కె. ఏసుబాబు మాట్లాడుతూ ఎలుకల మందు పెట్టే విధానం గురించి రైతులకు వివరించారు. సొసైటీ సీఈఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం, రైతులు తాడి రామారావు, ముత్యాల రామకృష్ణ, బోళ్ల రామారావు, గనిశెట్టి వీర్రాజు, నిమ్మలపూడి చిన్న, అనుసూరి వెంకటరమణ, పసల జానికయ్య, పి.సురేష్, గునిపే శ్యామసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న చైర్మన్ గంగాధరరావు

68 కేజీల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

కపిలేశ్వరపురం: వరి పంటను దెబ్బతీసే ఎలుకలను నివారించేందుకు రైతులంతా సామూహిక ప్రయత్నం చేయాలని, అందుకోసం ప్రభుత్వం సరఫరా చేసిన బ్రోమోడయోలిన్ మందును ఒకేసారి సమీప రైతులంతా ఎలుకల బొరియల వద్ద అమర్చాలని ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని 15 గ్రామాల్లో 68 కేజీల బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 15,875 ఎకరాలకు మందును పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ మేడిశెట్టి దుర్గారావు, ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక


కాజులూరు జెడ్పీ హైస్కూల్ నుంచి జిల్లా క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాజులూరు: జిల్లా స్థాయి పాఠశాల క్రీడలకు కాజులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ఎంపికై నట్టు స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జీజేసీఆర్ కౌర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో స్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం గవర్నమెంట్ హైస్కూల్‌లో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరచి పలు విభాగాల్లో జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 బాలుర విభాగంలో పి.శ్రీసృజన (షటిల్), వి.నరేష్ (వాలీబాల్), కె.హిమవిజయ్ (కబడ్డీ), అండర్-14 బాలికల విభాగంలో కె.కుసుమ (యోగా), డి.శ్రీవల్లి, అండర్-17 బాలుర విభాగంలో వై.సూర్యమణికంఠ (కబడ్డీ), ఒ.సంజయ్(వాలీబాల్), ఎస్ రామనాథాంజనేయులు (వాలీబాల్), కె నాగరామాంజనేయులు (షటిల్)కు ఎంపికయ్యారన్నారు. ఉపాధ్యాయులు ఆర్ మూర్తి, కె.నాగలక్ష్మి, తదితరులు విద్యార్థులను అభినందించారు.


జిల్లా పోటీలకు ఎంపికైన వేగాయమ్మపేట క్రీడాకారులతో హెచ్ఎం తదితరులు

జిల్లా పోటీలకు ఎంపికైన వేగయమ్మపేట క్రీడాకారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట శ్రీమహాలక్ష్మమ్మ హిందూ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉన్నత ప్రతిభను కనబర్చి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వడ్డమాని సోమసుందరం శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. పీఈటీ జి.అనురాధ శిక్షణలో త్రోబాల్, టెన్నీకాయిట్ పోటీలో రాణించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ అంబటి తుకారం, విద్యా కమిటీ చైర్మన్ కె.వెంకటరమణలను అభినందించారు. జిల్లాకు అర్హత సాధించిన విద్యార్థులు అండర్-14, విభాగంలో ధనష్‌కుమార్, నగేష్‌కుమార్, ఇర్మియా, ఝాన్సీలక్ష్మీదుర్గ, రూపామణి, అనిత, మేఘనా లక్ష్మి, హేమసిందూ, అండర్ 17 విభాగంలో సాయి కిషోర్, అనిల్‌కుమార్, సత్యసాయి గణేష్, ఐశ్వర్య, పార్వతి, సాత్విక, సత్యవేణిలు ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు హెచ్ఎం తెలిపారు.

సామూహిక నివారణకు రైతులు సహకరించాలి


శివలలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏఓ రవి

రామచంద్రపురం రూరల్: రైతులంతా ఒకే సారి సామూహిక ఎలుకల నివారణ చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దీని మూలంగా రైతులంతా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ డీడీఏ డి.వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని వెల్లలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు అధ్యక్షతన రైతులందరికీ ఎలుకల మందు నూకల మిశ్రమం పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన డీడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులందరూ ఒకేసారి ఎలుకల మందును వాడటం మూలంగా ఫలితాలు అధికంగా ఉంటాయన్నారు. రైతులు, గ్రామ వ్యవసాయ సహాయలకులతో కలిసి సామూహిక ఎలుకల నిర్మూలన చేపడదాం, అధిక దిగుబడులు సాధిద్దాం అనే నినాదంతో గ్రామంలోని రైతులను చైతన్యం చేస్తూ ర్యాలీ చేశారు. ఆత్మా డీడీ పి.జ్యోతిర్మయి, ఏడీఏలు ఏవీఎస్ రాజశేఖర్, కె.నాగేశ్వరరావు, శాస్త్రవేత్త ప్రదీప్, ఏఓ ఎన్.సత్యప్రసాద్, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి మోహన్, రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వెల్లలో ర్యాలీ చేస్తున్న వ్యవసాయాధికారులు

కె.గంగవరంలో..

కె.గంగవరం: రైతులంతా సామూహికంగా ఎలుకలను నియంత్రించాలని, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, ఏఓ బి.రవి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించి మందును పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఒక్కో రైతు ఒక్కో సారి కాకుండా రైతులంతా ఒకే సారి పొలం గట్ల వద్ద ఎన్న ఎలుక బొరియల్లో ఉంచాలన్నారు. తద్వారా వరి పంట పొలాలను నాశనం చేసే ఎలుకను పూర్తి స్థాయిలో నియంత్రించవచ్చని సూచించారు. 100 గ్రాముల బ్రోమోడయోలిన్ మందుకు 5 కేజీల బియ్యం నూకలు, 100 గ్రాముల నూనె కలిపి చిన్న చిన్న పొట్లాల్లా కట్టి రైతులంతా ఒకే సారి బొరియల వద్ద ఉంచాలని సూచించారు. అనంతరం మందును కలిపే విధానాన్ని రైతులకు వివరించి ఆ మందును రైతులకు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు కోటి లక్ష్మీనరసమ్మ, అనుసూరి సాయి, వాసంశెట్టి దుర్గాభవాని, కళ్యాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'నన్నయ'లో ఈసీ మెంబర్‌కు సత్కారం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా ఉన్న గంధం నారాయణరావును బీఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 35 సంవత్సరాలు సేవలందించిన నారాయణరావు లిటిల్ రోస్ విద్యా సంస్థల చైర్మన్‌గా, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యావేత్తగా ఎంతో అనుభవశాలి అయిన ఈయనను ఈసీ మెంబరుగా నియమించడం హర్షణీయమన్నారు. గోదావరి జిల్లాలలో బీఈడీ కళాశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. గంధం నారాయణరావు మాట్లాడుతూ ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కేవీఎస్ రమేష్, ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, కార్యదర్శి సువర్ణ కుమార్ పాల్గొన్నారు.


ఈసీ మెంబర్ నారాయణరావును సన్మానిస్తున్న దృశ్యం

యువతి అదృశ్యంపై కేసు

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై శుక్రవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కాలనీలో నివసిస్తున్న తోట మోహన్ గురువారం ఉదయం పనికి వెళ్లాక అతడి భార్య జయమ్మ తన సోదరితో కలిసి వలంటీర్ వద్దకు వెళుతున్నట్టు చెప్పింది. సాయంత్రమైన ఇంటికి తిరిగి రాకపోయే సరికి చుట్టుపక్కల గాలించిన ఆచూకీ దొరక్కపోవడంతో మాణిక్యం అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కె.అప్పారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న జగనన్న సురక్ష


జగనన్న సురక్ష కూపన్లు అందిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు, వైద్య సిబ్బంది తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వచ్చేనెల 7న మాణిక్య విద్యామందిరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు విజ్ఞప్తి చేశారు. హెల్త్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ హెల్త్ సర్వే చేస్తూ ఉచిత ఆరోగ్య సురక్ష కూపన్లను సర్పంచ్ సతీష్‌రావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సదుపాయం అందివ్వడమే కాకుండా 104 కాల్ సెంటర్ ద్వారా, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా 108 అంబులెన్స్ ద్వారా, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా, ప్రాథమిక వైద్యం ద్వారా ఈ ప్రభుత్వం అనేక వైద్య సదుపాయాలు అందిస్తుందన్నారు. గ్రామంలో అక్టోబర్ 7 న జగనన్న సురక్షలో ఏడు రకాల టెస్టులు అక్కడికక్కడే ఉచితంగా అందిస్తూ అనుభవజ్ఞులైన వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ మహిళ నేతలు

మండపేట: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మహిళా బిల్లును తీసుకు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మహిళ విభాగం నేతలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక కలువ పువ్వు సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహిళా నేతలు వై. విజయ, కె శ్రావణి, కె ఉషాకుమారి తదితరులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రధాని అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళా బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ అనంతరం స్థానికులకు స్వీట్లు పంచారు. బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, చాత్రాతి జానకిరాంబాబు, ఇళ్ల వెంకటేశ్వరరావు, కేవీవీ సాయిరాం, మద్దుల సుబ్బారావు, బుద్దవరపు రాజు, శ్రీనివాస్, పిల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయాలి


జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలైన దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న చామంతి నాగేశ్వరరావు

కాజులూరు: దివ్యాంగుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీసి వారు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు అన్నారు. రెండు రోజుల క్రితం కాకినాడలో జరిగిన దివ్యాంగుల ఆటల పోటీలో కాజులూరు భవిత కేంద్రం నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొని 38 అవార్డులు సాధించారు. ఈ మేరకు శుక్రవారం దివ్యాంగుల పాఠశాలలో ఎంఈఓ వివేకానంద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు పాల్గొని విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆటల పోటీల్లో విద్యార్థులకు తగిన రీతిలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.జాన్, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, ఎం.జయప్రకాశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు శుక్రవారం దాతలు నిత్యవసరాలు పంపిణీ చేశారు. పాతకోట గ్రామానికి చెందిన కూర్మ దేవి, గుమ్మడి అనసూయ, యండగండి గ్రామానికి చెందిన పలివెల మంగాయమ్మ, పండు సుబ్బారావు, శేష, సత్యవాడ గ్రామానికి చెందిన కాండ్రకోట మోహన్, దంగేరు గ్రామానికి చెందిన వడ్డే గోవింద్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరపున బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.